క్లుప్తంగా

ఉమా చంద్రమౌళీశ్వరుడికి విశేష అభిషేకాలు



సింహాచలం: అడవివరంలోని చంద్రగార్డెన్స్‌లో ఉన్న ఉమాచంద్ర మౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా పూజలు, అభిషేకాలు జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వామికి రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉదయ్‌కృష్ణశర్మ, ద్వాదశి సోదరుల ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు జరిగాయి.

అప్పన్న సన్నిధిలో చోడవరం ఎమ్మెల్యే



స్వామివారికి పూలు, తులసిమాల సమర్పిస్తున్న ఎమ్మెల్యే రాజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనమిచ్చి, ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని సూపరింటెండెంట్ త్రిమూర్తులు అందించారు.

బలిరెడ్డికి అదీప్‌రాజ్ నివాళి



సత్యం మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: మండలంలోని ఇరువాడకు చెందిన మండల వీఆర్వోల సంఘం మాజీ అధ్యక్షుడు బలిరెడ్డి సత్యం మృతదేహానికి ఆయన స్వగ్రామంలో సోమవారం అంత్యక్రియలు ముగిశాయి. మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొని, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళులు అర్పించిన వారిలో పార్టీ సీనియర్ నాయకులు కొటాన రాము, బోకం రామునాయుడు, అంతకాపల్లి సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, బోను గంగునాయుడు, బలిరెడ్డి కనకరాజు, బంగారు నాయుడు, పెందుర్తి వైస్ ఎంపీపీ చిరికి దేముడు తదితరులు ఉన్నారు.


భూ సమస్యలకు సకాలంలో పరిష్కారం



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న రీ సర్వే డీటీ గణేష్, తదితరులు

సబ్బవరం: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యలకు, సదస్సులు ముగిసిన 15 రోజుల్లో పరిష్కరించి, రైతులకు న్యాయం చేస్తామని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వై.గణేష్ అన్నారు. మండలంలోని బంగారమ్మపాలెం గ్రామంలో సోమవారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో ఆయన రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. రైతులు వివిధ భూ సమస్యలపై 44 అర్జీలు ఇచ్చినట్లు వెల్లడించారు. వాటిని వీలైనంత వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, సర్పంచ్ దాడి లావణ్య, ఎంపీటీసీ రాపేటి అరుణ, గ్రామ పెద్దలు రాపేటి రాము, దాడి కన్నంనాయుడు, ఆర్ఐ వీరయ్య, సచివాలయ సర్వేయర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా అమ్మకాలకు అనుమతులు తప్పనిసరి



మల్లికార్జునరావు, సీఐ, పరవాడ

పరవాడ: అనుమతుల్లేని బాణసంచా విక్రయాలపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు హెచ్చరించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ అక్రమ బాణసంచా అమ్మకాలపై సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. పోలీసుల అనుమతులు పొంది బాణసంచా సామగ్రిని విక్రయించుకోవచ్చన్నారు. అన్ని రకాల భద్రతా చర్యలు పాటించాలన్నారు.

శిథిలం.. భయం.. భయం



ఇరువాడ ఎస్సీ కాలనీలోని వాటర్ ట్యాంక్ దుస్థితి

2024 జూన్ 30
ఉత్తరప్రదేశ్‌లోని మధురలో ఓ మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంక్ కూలి ఇద్దరు మరణించారు. 12 మందికి గాయపడ్డారు.

2024 అక్టోబర్ 24
మహారాష్ట్రలోని పూణే జిల్లా, పింప్రి చింద్వాడ్‌లో వాటర్ ట్యాంక్ కూలిపోవడంతో ఐదుగురు కూలీలు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు.

శిథిల ఓవర్‌హెడ్ ట్యాంకులతో పొంచివున్న ముప్పును తెలుసుకుని, అప్రమత్తం కాకపోతే జరిగే ప్రమాదాలకు తార్కాణాలివి. సబ్బవరం మండలంలో కూడా పలు ఓవర్‌హెడ్ ట్యాంకులు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటి పిల్లర్లు బీటలు వారి, లోపలున్న ఐరన్ రాడ్లు దర్శనమిస్తూ ప్రజల్ని భయపెడుతున్నాయి. వాటిని తొలగించాలన్న స్థానికుల అభ్యర్థన పాలకులకు పట్టట్లేదు.



బీటలు వారిన వాటర్ ట్యాంక్ పిల్లర్

- శిథిలావస్థలో మండలంలోని పలు మంచి నీటి ట్యాంకులు
- కాలం చెల్లిన ట్యాంకులు, పైప్‌లైన్లతో తాగునీరు వృథా
- ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోని అధికారులు

సబ్బవరం: శిథిలావస్థకు చేరుకున్న ఓవర్‌హెడ్ ట్యాంకులు ఏ క్షణాన కుప్పకూలి, ఎంత మంది ప్రాణాల్ని హరిస్తాయోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కాలం చెల్లిన ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులు, పైపులైన్లతో ఎక్కడికక్కడ తాగునీరు వృథా అవుతోంది. దీంతో ఆయా గ్రామాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా ఇంటింటికీ తాగునీరు అందించేందుకు సంకల్పించిన జల్ జీవన్ మిషన్(జేజేఎం) పనులు కూడా కూటమి ప్రభుత్వంలో పడకేశాయి. శిథిల ట్యాంకుల్ని తొలగించి, కొత్తవాటిని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

బీటలు వారి.. శిథిలావస్థకు చేరి

మండలంలోని ఇరువాడ ఎస్సీ కాలనీలోని దాదాపు 80 కుటుంబాల కోసం 24 ఏళ్ల క్రితం 10 వేల లీటర్ల సామర్థ్యమున్న ఓవర్ హెడ్ ట్యాంక్‌ను నిర్మించారు. ప్రస్తుత ఆ పక్కనే ఉన్న బీసీ కాలనీకి కూడా ఈ ట్యాంక్ నీరే ప్రధాన ఆధారం. ప్రస్తుతం ఈ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. పిల్లర్లు బీటలు వారి, ఇనుప చువ్వలు దర్శనమిస్తున్నాయి. పంప్ హౌస్ నుంచి ట్యాంకుకు వచ్చే పైప్‌లైన్ కూడా పలుచోట్ల దెబ్బతిని, తాగునీరు వృథాగా పోతోంది. దీంతో రెండు కాలనీలకు చెందిన ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పలుమార్లు ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం కనిపించట్లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కొత్తది నిర్మించి.. పాతది వదిలేసి

అంతకాపల్లి గ్రామంలో సచివాలయానికి సమీపంలో ఉన్న రక్షిత మంచినీటి ట్యాంకు శిథిలావస్థకు చేరింది. అప్పటి అవసరాలకు తగ్గట్లు 40 వేల లీటర్ల సామర్థ్యంతో దీన్ని దశాబ్దాల క్రితం నిర్మించారు. ప్రస్తుతం ఈ ట్యాంకు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రత్యామ్నాయంగా గత ప్రభుత్వంలో 60 వేల లీటర్ల సామర్థ్యంతో రక్షిత మంచినీటి ట్యాంక్‌ను నిర్మించారు. దీని ద్వారానే ప్రస్తుతం నీరు సరఫరా చేస్తున్నారు.

అయితే శిథిలావస్థకు చేరిన పాత ట్యాంకును తొలగించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న సమయంలోనే ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ కార్యరూపం దాల్చలేదు. కొత్త ప్రభుత్వంలో అధికారులు ఆ దిశగా కనీస ప్రయత్నాలు చేయకపోవడంతో దాని చుట్టుపక్కలున్న జనం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

పురోగతిలేని జల్ జీవన్ మిషన్

టెక్కలిపాలెం శివారు నాయనమ్మపాలెం, బంగారమ్మపాలెంలోని ఓవర్‌హెడ్ ట్యాంకు కూడా శిథిలావస్థకు చేరుకుంది. బంగారమ్మపాలెంలోని శిథిల ట్యాంకును మాత్రం ఇటీవలే తొలగించి, డైరెక్ట్ పంపింగ్ ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్నారు. అయితే కరెంట్ ఉంటేనే వారికి నీటి సరఫరా, లేకుంటే ఎదురుచూపులే గతి. మరోవైపు పైప్‌లైన్లకు మరమ్మతులు చేపట్టాలి. గత ప్రభుత్వంలో చేసిన ప్రతిపాదనలు మూలకు చేరాయి. జల్ జీవన్ మిషన్(జేజేఎం) పథకంలో భాగంగా గ్రామంలో రూ.26.45 లక్షలతో ఇంటింటికీ తాగునీటిని అందించేందుకు గత ప్రభుత్వంలో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనుల్లో కనీస పురోగతి లేదు.

కొత్త ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించాలి



ఇరువాడలో ఎస్సీ కాలనీ నిర్మాణం తర్వాత దళితుల పోరాటంతో 2001లో వాటర్ ట్యాంకు నిర్మించారు. అప్పట్లో కాలనీలోని 80 కుటుంబాల కోసం నిర్మించిన ఈ ట్యాంక్, శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం ఈ ట్యాంకు ద్వారా ఎస్సీ కాలనీతో పాటు బీసీ కాలనీ కలిపి 250 కుటుంబాలకు నీరందుతోంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని, కొత్త ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.
– మచ్చ కోటేశ్వరరావు, ఎస్సీ కాలనీ, ఇరువాడ

ప్రతిపాదనలతోనే సరి!



మావుళ్లోని ఎన్టీఆర్ కాలనీ, వైఎస్సార్ కాలనీ, ఇందిరమ్మ కాలనీలకు పెద్ద ఓవర్ హెడ్ ట్యాంకు కోసం జేజేఎం పథకంలో ప్రతిపాదనలు సిద్ధం చేసి, ఉన్నతాధికారులు పంపినట్లు అధికారులు చెప్పారు. ఎస్సీ కాలనీలో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్‌ను తొలగించి, కొత్తది నిర్మించేందుకు, గ్రామంలో ఇంటింటికీ తాగునీటి కొళాయిల కోసం గత ప్రభుత్వంలోనే ప్రతిపాదించారు. కొత్త ప్రభుత్వంలో అవేవీ ముందుకు నడవట్లేదు.
– బలిరెడ్డి కనకరాజు, ఇరువాడ గ్రామం

జేజేఎం నిధులతో పనులు



జేజేఎం నిధులతో 26 పనులు చేపట్టాం. ఇప్పటికే 15 పనుల వరకు పూర్తయ్యాయి. మరో 11 పనులు తుది దశలో ఉన్నాయి. అదనంగా మరి కొన్ని పనులను టెండర్ ప్రక్రియలో ఉన్నాయి. ఇరువాడ ఎస్సీ కాలనీలో వాటర్ ట్యాంకుకు మండల పరిషత్ నిధులు రూ.3 లక్షలతో మరమ్మతులు చేపడుతున్నాం. మరో 20 వేల లీటర్ల ట్యాంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి, ఉన్నతాధికారులకు, ఎమ్మెల్యేకు నివేదించాం. – డి.శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, సబ్బవరం మండలం

'పాల సేకరణ ధరను పెంచకపోతే డెయిరీ ముట్టడి'



భర్నికంలో నిరసన తెలుపుతున్న రైతులు

పరవాడ: విశాఖ మిల్క్ డెయిరీ యాజమాన్యం పాల సేకరణ ధరను తగ్గించడం సరికాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆక్షేపించారు. పాల సేకరణ ధరను తగ్గించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భర్నికం గ్రామంలో సోమవారం పాడి రైతులు నిరసన తెలిపారు. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న గనిశెట్టి మాట్లాడుతూ విశాఖ డెయిరీ యాజమాన్యం పాల సరఫరా ధరను ఆకస్మికంగా తగ్గించడం అన్యాయమన్నారు. పశువుల దాణా ధరల్ని పెంచి పాడి రైతులపై భారం మోపిందన్నారు. తగ్గించిన పాల సేకరణ ధరను తక్షణమే పెంచకపోతే ఈ నెల 29(మంగళవారం)న పాడి రైతుల ఆధ్వర్యంలో డెయిరీని ముట్టడిస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో పాడి రైతులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 5 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ హైమావతి

పెందుర్తి: వేపగుంటలోని జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 5 వినతులు అందాయి. 95వ వార్డు కృష్ణరాయపురంలో ఓ భూమి సర్వే కోసం, 98వ వార్డు సింహపురి లేఅవుట్‌లో రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని, అదే వార్డు పద్మావతినగర్‌లో పిచ్చి మొక్కలు తొలగించాలని, 97వ వార్డు సుజాతనగర్ ప్రాంతంలో పిచ్చి మొక్కలు తొలగించాలని, అదే వార్డులో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, వీధి దీపాలు వేయాలని ప్రజలు జోనల్ కమిషనర్ హైమావతిని కోరారు. ఆయా వినతులను స్వీకరించిన జెడ్సీ వాటిని సంబంధిత అధికారులకు అందించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జోన్–8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫంక్షన్ హాల్‌లో షార్ట్‌సర్క్యూట్.. చెలరేగిన మంటలు

- అదుపుచేసిన అగ్నిమాపక సిబ్బంది, పెందుర్తి పోలీసులు
- అపార్ట్‌మెంట్‌లో అనుమతి లేకుండా ఫంక్షన్ హాల్ నిర్వహణ



రాజ్యలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో చెలరేగుతున్న మంటలు



మంటలను అదుపు చేస్తున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోని రాజ్యలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది మంటలను సకాలంలో అదుపు చేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనతో రాజ్యలక్ష్మి రెసిడెన్సీ పేరిట ఉన్న అపార్ట్‌మెంట్‌లో అనధికారికంగా ఫంక్షన్ హాల్ నిర్వహిస్తున్నట్లు బయటపడింది. సరైన భద్రతా ప్రమాణాలు పాటించకుండా దీన్ని నడుతున్నట్లు తెలిసింది.

తప్పిన పెను ప్రమాదం..

రాజ్యలక్ష్మి రెసిడెన్సీ/ఫంక్షన్ హాల్‌లోని ఓ గది నుంచి రాత్రి 8 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. స్థానికులు గుర్తించి పెందుర్తి పోలీసులకు, అగ్నిమాపక స్టేషన్‌కు సమాచారం అందించారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు కృషి చేశారు. కాసేపటికి అగ్నిమాపక శకటం రావడంతో మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయి. సోమవారం రాత్రి ఇందులో ఎలాంటి కార్యక్రమాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మరోవైపు ఈ ఫంక్షన్ హాల్లో కనీస భద్రతా ప్రమాణాలు, పరికరాలు లేకపోవడం గమనార్హం. అపార్ట్‌మెంట్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఫంక్షన్ హాల్ నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

జాతీయ పశుగణన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు

పరవాడ: కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పరవాడ సబ్ డివిజనల్ ఏడీ డాక్టర్ రామకృష్ణ కీర్తి తెలిపారు. స్థానిక పశువైద్యశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు చేతుల మీదుగా అఖిల భారత పశుగణన వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏడీ రామకృష్ణ కీర్తి మాట్లాడుతూ అన్ని జాతుల పశువులు, జంతువుల గణన చేపట్టి ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. పశుగణనతో మరింత మెరుగ్గా ప్రభుత్వ పథకాల అమలు, రూపకల్పన సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు సురేష్‌కుమార్, అశ్విని, సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజానికి కృషి



ప్రతిజ్ఞ చేస్తున్న సింహాద్రి ఎన్టీపీసీ అధికారులు, ఉద్యోగులు

పరవాడ: అవినీతి రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సింహాద్రి ఎన్టీపీసీ సీజీఎం సీపీజీ రష్మిరంజన్ పరిదా పిలుపునిచ్చారు. సింహాద్రి ఎన్టీపీసీలో ఉద్యోగుల సమక్షంలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్–2024ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్టోబర్ 28 నుంచి నవంబరు 3 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ ఏడాది విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా సంస్థ సమగ్రత, పారదర్శకత, జవాబుదారీతనాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. దేశ శ్రేయస్సు కోసం సమగ్రత, సంస్కృతి అనే నినాదంతో అవినీతికి కారణాలు, వ్యాప్తి పరిణామాలు, సమాజంపై దాని ప్రభావం గురించి అవగాహన పెంచడమే లక్ష్యంగా ఎన్టీపీసీ సింహాద్రి పనిచేస్తుందన్నారు. నైతిక విలువల పట్ల ఉద్యోగుల నిబద్ధతను బలోపేతం చేయడానికి కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. విధుల్లో పారదర్శకత, ఉద్యోగుల్లో నైతిక విలువలు పొందించడంపై అధికారులు దృష్టిసారించాలన్నారు. ఈ మేరకు అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అన్ని విభాగాలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా నడక పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌వీఎల్‌ఎన్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు గొర్లె నాగార్జున

సింహాచలం: అడవివరంలోని గోశాల వద్దనున్న ఎస్‌వీఎల్‌ఎన్ వాకర్స్ క్లబ్ 13వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా స్థాయి నడక పోటీలను ఘనంగా నిర్వహించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు గొర్లె నాగార్జున జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. పురుషులకు, మహిళలకు వేర్వేరుగా నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లాలోని పలు వాకర్స్‌క్లబ్ సభ్యులతోపాటు స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పాత గోశాల నుంచి సింహపురికాలనీ వరకు ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌లో ఉల్లాసంగా.. ఉత్సాహంగా నడిచి తమ సత్తాచాటారు. విజేతలకు బహుమతులందించారు. క్లబ్ ఫౌండర్ జి.సూర్యనారాయణ, కార్యదర్శి శ్రీహరి, గవర్నర్ టి.రంగారావు, ఎలక్ట్ గవర్నర్ ద్వారకానాథ్, శుభ, ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.

చురుగ్గా బీజేపీ సభ్యత్వ నమోదు

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు పాపయ్యరాజుపాలెం, ఆర్‌టీసీ కాలనీ, బీసీ కాలనీ, శివగాయత్రినగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు ఆధ్వర్యంలో కాలనీల్లోని ప్రధాన కూడళ్లలో సభ్యత్వ నమోదు శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సుస్థిర పాలన కొనసాగాలంటే అది బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. కాలనీల ప్రతినిధులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల భాగస్వామ్యంతో విద్యాప్రమాణాల పెంపు



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పీవీఎన్ మూర్తి

సబ్బవరం: కార్పొరేట్ విద్యాలయాలకు దీటుగా ప్రభుత్వ విద్యాలయాలు విద్యను అందిస్తున్నాయని, దాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పీవీఎన్ మూర్తి తెలిపారు. స్థానిక జూనియర్ కళాశాలలో విద్యాప్రమాణాల మెరుగుదలపై తల్లిదండ్రులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఇంటర్ బోర్డు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు విద్యార్థుల నడవడిక, విద్యా ప్రమాణాల మెరుగుదలకు పాటించాల్సిన నియమాలను వివరించారు. ప్రభుత్వ కళాశాలల్లో సదుపాయాల కల్పనకు, విద్యా బోధనకు ఇస్తున్న ప్రాముఖ్యతను తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ క్లాస్‌లు, డిజిటల్ క్లాస్‌ల ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులకు కూడా సాంకేతికను చేరువ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.మోహనరావు, కె.వెంకటేశ్వరరావు, సుభాషిణి, ఎ.జనార్దనరావు, జె.వివేకానందరావు, బి.గోవిందరావు, ఎస్.శ్రీనివాసరావు, ఎల్‌వీ రమణబాబు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పంట చేలో పాలకంకి నవ్వులు



పంట చేలో పాలకంకి నవ్వింది.. పల్లకీలో పిల్ల ఎంకి నవ్వింది..

ఈ వేటూరి గీతానికి స్ఫూర్తి ఏ సొగసిరి వరి'చేనో తెలియదుగానీ.. పెందుర్తి పరిధి గ్రామాల్లో ఖరీఫ్ వరిని చూస్తే ఆ పాట గుర్తుకు రాక తప్పదు. ప్రస్తుతం గ్రామాల్లో వరి చేను కంకులు పాలుపోసుకుంటున్నాయి. సిగ్గు, బిడియంతో తలలు వంచుకునే మగువల్లా, గింజలు బరువెక్కి నేల చూపులు చూస్తున్నాయి. ఆరంభంలో వర్షాభావ పరిస్థితులు, ఇటీవల కురిసిన వరుస వర్షాలు రైతుల్లో కాస్త ఆందోళన పెంచాయి. ప్రస్తుతం ఆ బెంగ తీరింది. చాలా చోట్ల పొట్ట దశ దాటి, కంకులు పాలుపోసుకోవడంతో పంట దిగుబడి ఆశాజనంగానే ఉంటుందని రైతులు చెప్తున్నారు.
- పెందుర్తి

'వైద్య, ఆరోగ్య శాఖ కాంట్రాక్టర్లపై విచారణ జరపాలి'



ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ ప్రతినిధులు

పెందుర్తి: వైద్య, ఆరోగ్యశాఖ కాంట్రాక్ట్ కార్మికుల సొమ్మును కాజేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ శాఖ కాంట్రాక్టర్లపై సమగ్ర విచారణ చేపట్టాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ డిమాండ్ చేశారు. జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సొమ్మును సంబంధిత కాంట్రాక్టర్లు దుర్వినియోగం చేసినట్లు వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలోని వివిధ ఆస్పత్రుల్లో వేతనాలకు మించి చాకిరి చేస్తున్నారని.. తక్షణమే తగిన సిబ్బందిని నియమించాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ, నాయకులు భవాని, లక్ష్మి, ఝాన్సీ, దేవికుమార్, ఉమాదేవి, రామలక్ష్మి, గణేష్, పైడమ్మ, లక్ష్మి, పద్మ, కుమారి పాల్గొన్నారు.

అప్పన్న ప్రసాదశాలలో జీడిపప్పు చోరీకి యత్నం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ప్రసాదాలశాలలో రెండు రోజుల కిందట జీడిపప్పు డబ్బాను మాయం చేసేందుకు ప్రయత్నించిన ఓ ఉద్యోగి పట్టుబడిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. ఆ ఉద్యోగి చేత సంజాయిషీ లెటర్ రాయించుకుని వదిలేయడం దేవస్థాన వర్గాల్లో చర్చనీయాంశమైంది. వివరాలు. అన్నదాన భవనంలోని పై అంతస్తులో లడ్డూ తయారీ జరుగుతుంది. అదే భవనం కింది అంతస్తులో ఉన్న స్టోర్స్ నుంచి అవసరమైన ముడిసరకులను ప్రసాదాల తయారీ సెక్షన్‌కి పంపిస్తుంటారు. రెండు రోజుల కిందట లడ్డూ తయారీకి వినియోగించే జీడి పప్పులో ఓ డబ్బా జీడిపప్పును ప్రసాదాల సెక్షన్‌లో పనిచేస్తున్న ఓ ఉద్యోగి గోనె సంచెలో పెట్టి, అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించారు. దీన్ని గుర్తించిన కొందరు సిబ్బంది విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సీసీ కెమెరాలను పరిశీలించగా రుజువయింది. దీంతో సంబంధిత ఉద్యోగిని మందలించి, సంజాయిషీ రాయించి వదిలేశారు. దీనిపై ప్రసాదాల విభాగం ఏఈవో పి.శ్రీనివాసరావును వివరణ కోరగా స్టోర్స్ నుంచి ప్రసాదాల విభాగానికి వచ్చే సరకుల్లో మిగిలిన వాటిని, ఎప్పటికప్పుడు స్టోర్స్‌కి జమచేస్తామన్నారు. జీడిపప్పు డబ్బా అదనంగా ఉండటంతో దాన్ని జమచేయడంలో నిర్లక్ష్యం వహించిన సదరు ఉద్యోగిని ప్రశ్నించినట్లు తెలిపారు.